క్లుప్తంగా

చిరు ధాన్యాల సాగుపై అవగాహన



ఉయ్యూరు: చిరు ధాన్యాల సాగుపై రైతులు ఆసక్తి పెంచుకోవాలని కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పార్థసారథి కోరారు. పట్టణంలోని 1వ వార్డు పరిధిలోని ఎగినపాడులో చిరుధాన్యాల సాగుపై ఆదివారం అవగాహన కల్పించారు. ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. 32 రకాల చిరుధాన్యాల సాగు విధానం, రైతులకు కలిగే ప్రయోజనం, భూ సార పరిరక్షణ అంశాలను వివరించారు. నవధాన్యాల సాగు–నేలతల్లికి బాగు, పుడమి తల్లికి నైవేద్యం అంటూ ప్లకార్డులను ప్రదర్శించి రైతులను చైతన్యపరిచారు. కార్యక్రమంలో మండల కమ్యూనిటీ రీసోర్సు పర్సన్‌లు నిర్మల, సుగుణ, పద్మజ, రైతులు గౌరిపర్తి ఫణికుమార్ పాల్గొన్నారు.

వైభవంగా బూసిమ్మతల్లి శిడిబండి ఉత్సవం



ఉయ్యూరు: బూసిమ్మతల్లి శిడిబండి ఉత్సవం వైభవంగా సాగింది. మండలంలోని ముదునూరు గ్రామంలో వేంచేసి ఉన్న కూరాకుల వంశస్తుల ఇలవేల్పు బూసిమ్మతల్లి తిరునాళ్ల ఆదివారంతో 12వ రోజుకు చేరింది. 15 రోజులు పాటు సాగే ఈ తిరునాళ్ల మహోత్సవంలో ఆదివారం శిడిబండి ఉత్సవం సంబరంగా ముగిసింది. తొలుత ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి, సర్పంచ్ మొవ్వా వెంకట నాగలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం శిడిబండికి పూజలు చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం కూరాకుల, పల్లపోతు వంశస్తులతో పాటుగా గ్రామస్తులు డప్పు వాయిద్యాలు, మేళతాళాలతో సంప్రదాయబద్ధంగా శిడిబండిని ఊరేగించారు. దారి పొడవునా భక్తులు పసుపునీళ్ల ఓరబోసి భక్తిపారవశ్యం చెందారు.

సామాజిక కార్యకర్త జంపానకు సత్కారం



ఉయ్యూరు: బహుజన సాహిత్య అకాడమీ సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్‌ను ఘనంగా సత్కరించింది. తిరుపతిలో ఆదివారం నిర్వహించిన బహుజన రచయితల ఆరో సమావేశంలో సమాజ అభ్యున్నతికి కృషి చేస్తున్న ఉయ్యూరుకి చెందిన సామాజిక కార్యకర్త, గురజాడ మాజీ సర్పంచ్ జంపాన శ్రీనివాసగౌడ్‌ను ప్రజా గాయకుడు గద్దర్, బీఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ సత్కరించి సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా శ్రీనివాసగౌడ్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభావంతులైన వ్యక్తులను సమావేశంలో సత్కరించారన్నారు.

11 మంది జూదరుల అరెస్ట్

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న జూద శిబిరాలపై ఆదివారం పోలీసులు దాడిచేసి 11 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని రూ.29 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. తొలుత చిక్కవరంలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని రూ.25 వేలు నగదు, ఐదు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. చెంచుల కాలనీలో కోడి పందేలు వేస్తున్న ఇరువురిని, అజ్జంపూడిలో పేకాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ పి.కనకరావు తెలిపారు.

10 మంది జూదరుల అరెస్ట్

హనుమాన్‌జంక్షన్ రూరల్: పేకాట, కోడిపందేలు వంటి జూదాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ వాసా వెంకటేశ్వరరావు హెచ్చరించారు. బాపులపాడు మండలం కె.సీతారామపురంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న జూద శిబిరంపై ఆదివారం ఎస్ఐ వెంకటేశ్వరరావు ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో 10 మంది జూదరులను అదుపులోకి తీసుకోవటంతో పాటుగా, నాలుగు కోడి పుంజులు, రూ.3500 నగదు స్వాధీనపర్చుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘా పెట్టామని చెప్పారు. జూద శిబిరాల నిర్వహణపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

నేడు తహసీల్దార్ కార్యాలయంలో స్పందన

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 నుంచి విజయవాడ రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో జరుగుతుందని తహసీల్దార్ పి.జాహ్నవి ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్పందన కార్యక్రమంలో పాల్గొనే అధికారులకు అందజేయాలని ఆమె తెలియజేశారు.

జన హృదయ జెండా

- పేదల క్షేమం కోసమే పుట్టిన పార్టీ వైఎస్సార్ సీపీ
- పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి
- ఘనంగా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం
- వాడవాడలా ప్రత్యేక కార్యక్రమాలు



కానూరులో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరై వైఎస్సార్‌సీపీ జెండాలు ఆవిష్కరించి, కేక్‌లు కట్ చేశారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కానూరు సనత్‌నగర్‌లో ఖాన్‌ప్లాజా వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. మహానేత ఆశయాలకు అనుగుణంగా సంక్షేమం–అభివృద్ధి లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ ఆవిర్భవించిందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో రాజన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి కేక్‌కట్ చేశారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ రాజన్న ఆశయాలకు అనుగుణంగా, అణగారిన, పేద బడుగు బలహీనవర్గాలు, రైతుల సంక్షేమం కోసం జగనన్న వైఎస్సార్ పార్టీని స్థాపించారన్నారు. పార్టీ ఏర్పాటు చేసిన తర్వాత జగనన్నకు బెదిరింపులు, కేసులు, కష్టనష్టాలు వచ్చినా వాటిని ఎదుర్కొని ఏ మాత్రం తొణకకుండా ప్రజల పక్షాన నిలిచారన్నారు. నేడు జగనన్న పాలనలో పేదలకు తోడు నీడగా ఉంటూ, వారి అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నారని తెలిపారు. నవరత్నాలతో ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అమలు చేసి న్యాయం చేశారని వివరించారు.

పాలనపై చర్చకు సిద్ధమా..

జగనన్న పాలన పై అవాకులు చవాకులు పేలుతున్న టీడీపీ నేతలు తనతో చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సవాల్ చేశారు. చంద్రబాబులా తాము ప్రజలను మోసం చేయలేదన్నారు. రైతులకు, డ్వాక్రా మహిళలకు చంద్రబాబు రుణాలు మాఫీ చేస్తానని మోండిచేయి చూపారని ఆరోపించారు. అమరావతి, సింగపూర్ జపంతో చంద్రబాబు కాలం గడిపారన్నారు. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో మూడున్నర సంవత్సరాలలో రూ. 525 కోట్లు సాయం పేదల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం నేరుగా జమ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ ఈడే చాముండేశ్వరి, కంకిపాడు జెడ్పీటీసీ సభ్యుడు బాకీబాబు, ఉయ్యూరు, కంకిపాడు మార్కెట్ యార్డు చైర్మన్‌లు వల్లభనేని వెంకటేశ్వరరావు, మద్దాలి రామచంద్రరావు, కానూరు మాజీ సర్పంచి అన్నేచిట్టిబాబు, పార్టీ నేతలు రాజులపాటి రామచంద్రరావు, నెర్సు సతీష్, గుమ్మడి విజయ్‌కుమార్, వీరబాబు, మరీదు శ్రీనివాస్, రెహమాన్, ఖాదర్, లతీఫ్, సాబు, చాంద్‌బాషా, సిద్దిక్, వల్లే నరసింహారావు, నల్లమోతు జీవన్, మాదు శ్రీనివాసరావు, వేమూరి బాలకృష్ణ, తాళ్ల నరేంద్ర, అన్నే శ్రావణ్, బందెల రాజు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

కంకిపాడు: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని మంతెన గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రధాన కూడలిలోని మహానేత వైఎస్సార్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి కార్యకర్తలకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో సర్పంచ్ వీరంకి వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు బండి శ్రీనివాసరావు, పార్టీ నేతలు రాజులపాటి శివబ్రహ్మేశ్వరరావు, గోగం పంగిడేశ్వరరావు, బండ్రపల్లి బాబూజీ, పోలిమెట్ల వెంకటేశ్వరరావు, వీరంకి శ్రీనివాసరావు, లాం శివాజీ పాల్గొన్నారు.

నున్నలో..

విజయవాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. నున్న గ్రామంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్, ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పాతపాడులో మండల పార్టీ కన్వీనర్ దేవగిరి ఓంకార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పి.నైనవరంలో గ్రామ పార్టీ కన్వీనర్ దావు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాలు వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. అంబాపురంలో గ్రామ పార్టీ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ తోడేటి రూబెన్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పించి స్వీట్లు పంపిణీ చేశారు.

గన్నవరంలో..

గన్నవరం: స్థానిక శాసనసభ్యుని కార్యాలయంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ జెండాను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రామిశెట్టి అంజనీకుమారి ఎగురవేశారు. అనంతరం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఎంపీపీలు అనగాని రవి, చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సభ్యులు కాకర్లమూడి సువర్ణరాజు, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ మహానేత వైఎస్సార్ ఆశయాల సాధన కోసం ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ 12 ఏళ్లు పూర్తిచేసుకుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పార్టీ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు, సర్పంచి నిడమర్తి సౌజన్య, మాజీ సర్పంచి నీలం బాబు, పార్టీ నేతలు మేచినేని బాబు, గొంది పరంధామయ్య, బోయిన భాను, అరుణకుమారి, జలసూత్రం రామ్మోహన్‌రావు, పాగోలు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాపులపాడు మండలంలో...

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం బాపులపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఆ పార్టీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జంక్షన్‌లోని ఇందిరానగర్ వంగవీటి మోహనరంగా సెంటర్‌లో జరిగిన వేడుకల్లో ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేశారు. గడిచిన 12 ఏళ్లగా వైఎస్సార్ సీపీ సాధించిన ఘన విజయాలను ఆయన గుర్తు చేశారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా పలు సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని కొనియాడారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను నక్కా గాంధీ కట్ చేశారు. ఎంపీపీ యర్రగొర్ల నగేష్, పార్టీ నాయకులు వేగిరెడ్డి సూర్యనారాయణ, కొమరవల్లి థామస్, నూకల బాలాజీ, రాజు, అల్లంశెట్టి శ్రీనివాసరావు, ఎత్తుల రాము, జోగి రామస్వామి పాల్గొన్నారు. బాపులపాడు మండలంలోని కోడూరుపాడులో వైస్ ఎంపీపీ చందు రమాదేవి, శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ జెండా ఎగురవేశారు. వీరవల్లిలో పీఏసీఎస్ చైర్మన్ అల్లాడి థెరిస్సా, పార్టీ నాయకులు గూడవల్లి రత్న సుధాకర్, కోడెబోయిన బాబి, రాయి శివ పార్వతి పాల్గొన్నారు. తిప్పనగుంటలో పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్ కేక్ కట్ చేసి, పార్టీ జెండాను ఎగురవేశారు. బండారుగూడెంలో వైఎస్సార్ విగ్రహానికి పార్టీ నాయకులు వడ్లమూడి తిరుపతిరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ సభ్యురాలు పరిమి మౌనిక హాజరయ్యారు.



హనుమాన్‌జంక్షన్‌లో వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంలో పార్టీ జెండా ఎగురవేస్తున్న నాటక అకాడమీ డైరెక్టర్ గాంధీ

పలు గ్రామాల్లో..

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఆవిర్భవించి 12 వసంతాలు పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఆయా గ్రామాల్లో వాడవాడల ఆవిర్భావ దినోత్సవం పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. రామవరప్పాడులో గ్రామ కన్వీనర్ సమ్మెట సాంబశివరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు (కోట్లు) ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, గన్నవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ రామిశెట్టి అంజనీకుమారి, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు. ప్రసాదంపాడు సహకార బ్యాంకు సమీపంలో పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్మా కోట్లు, ఎంపీటీసీ దూరు రత్నం, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎనికేపాడులో గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మాదు శివరామకృష్ణ ఇంటి ప్రాంగణంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు, నాయకులు కోనేరు సుబ్బారావు, పలువురు ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. నిడమానూరులో సర్పంచ్ శీలం రంగారావు ఆధ్వర్యంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్లు పరిమి విష్ణు, బొగ్గవరపు రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు రసూల్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మంతెనలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సర్పంచ్ వీరంకి వెంకటరమణ, ఇతర నేతలు



నున్నలో వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న పార్టీ నాయకులు



గన్నవరంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నేతలు



రామవరప్పాడులో పార్టీ జెండాను ఎగురవేస్తున్న కొమ్మా కోట్లు, సమ్మెట సాంబశివరావు తదితరులు

పేద కుటుంబాలకు జగనన్న అండ

- ఎమ్మెల్యే పార్థసారథి ఎదుట హర్షం వ్యక్తం చేసిన ప్రజలు
- కానూరు సనత్‌నగర్‌లో గడప గడపకు మన ప్రభుత్వం



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: 'పేద కుటుంబాలను జగనన్న ఆదుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వం కాని, నాయకులు కాని పేదల గురించి ఆలోచించలేదు. అర్హతుంటే చాలు అన్ని పథకాలు అందుతున్నాయి' అని సనత్‌నగర్‌కు చెందిన జహీరాబి, ఎండి.కలీం ఎమ్మెల్యే పార్థసారథి ఎదుట ఆనందం వ్యక్తం చేశారు. కానూరు సనత్‌నగర్‌లో ఆదివారం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి గడపగడప కార్యక్రమంలో భాగంగా గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ జగనన్న సంక్షేమ పాలనలో ఆనందంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సహకారంతో తమకు నేరుగా అందుతున్నాయని తెలిపారు. కాగా స్థానికంగా కుక్కల సమస్య తీవ్రంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యం, దోమల నివారణ చేపట్టాలని కోరారు.

పేదలకు అండగా ఉంటాం..

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఆయన మాట్లాడుతూ సనత్‌నగర్ పేదలు కోరిన విధంగా అందరికీ ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని తెలిపారు. అందరూ ఇల్లు కట్టుకుని ఇంటి యజమానులు కావాలని అన్నారు. స్థానికంగా ఉన్న సమస్యలు వెంటనే పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు అన్నే శ్రావణ్, చాంద్‌బాషా, అబ్దుల్‌ఖాదర్, ఎండీ సాబు, అబ్దుల్ లతీఫ్, ఎండీ సిద్దిఖ్, అబ్దుల్ రెహమాన్, నేరేళ్ల బుజ్జి, తాళ్ల నరేంద్ర, వేమూరి బాలకృష్ణ, కోసూరి నరేష్, పిన్నబోయిన రవి, అబంటి రమేష్, అజీజుల్లా, క్రిష్టోఫర్, ఈదారాజేష్, యాసిన్, సైకం చినబాబు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

దిరిశం కుటుంబ సేవలు ఆదర్శనీయం



దిరిశం సరోజిని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి, ఇన్‌కంటాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ సుధాకర్

ఉయ్యూరు: దిరిశం కుటుంబ సేవలు ఆదర్శమని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని ఎస్‌సీ కాలనీలో ఇన్‌కంటాక్స్ ప్రిన్సిపల్ కమిషనర్ దిరిశం సుధాకర్‌రావు మాతృమూర్తి సరోజిని ప్రథమ వర్ధంతి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే పార్థసారథి హాజరై సరోజిని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సరోజిని భర్త దిరిశం ప్రభాకర్‌రావు ఉయ్యూరు సమితి అధ్యక్షుడిగా, అణగారిన వర్గాల నాయకుడిగా చేసిన సేవలు ఎనలేనివన్నారు. కార్యక్రమంలో తిరువూరు మాజీ ఎమ్మెల్యే దిరిశం పద్మజ్యోతి, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజులపాటి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని గ్రామాలు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో సోమవారం ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, కేబుల్ లేయింగ్ వర్క్స్ నిమిత్తం రామవరప్పాడులో పటేల్ నగర్, సాయినగర్, హనుమాన్‌నగర్, టెంపుల్ ఏరియా, ఫ్లైఓవర్ దిగువ ప్రాంతం, ప్రసాదంపాడులో యాదవుల బజారులో పైన తెలిపిన సమయాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

14వ తేదీ నాటికి పన్నులు చెల్లించండి

పెనమలూరు: ఈ నెల 14వ తేదీ నాటికి ఇంటి పన్నులు అందరూ చెల్లించాలని తాడిగడప కమిషనర్ ఎన్.ప్రకాశరావు తెలిపారు. ఆయన ఆదివారం వివరాలు తెలుపుతూ ఇంటి పన్నులు చెల్లించే వా రు, పేర్లు మార్పులు చేర్పులు చేసుకునే వారు, కొత్తగా పన్నులు వేయించుకోవాల్సినవారు, ఖాళీ స్థలాల పన్నులు ఈ నెల 14వ తేదీ నాటికి చెల్లించాలన్నారు. పన్నులకు సంబంధించిన వెబ్‌సైట్ క్లోజ్ అవుతుందని, త్వరగా పన్నులు కట్టాలని తెలిపారు.

రచయిత్రి విజయశ్రీముఖికి సత్కారం



పామర్రు: తమ రచనల ద్వారా సమాజంలో చైతన్యం కలిగించడానికి కృషి చేసే రచయితలను గుర్తించి గౌరవిస్తే మరిన్ని రచనలు వస్తాయని పామర్రు కళా పరిషత్ అధ్యక్షులు ఎన్.త్రివిక్రమరావు అన్నారు. ఉత్తమ రచయిత్రిగా అవార్డు పొందిన పామర్రు కళా పరిషత్ సభ్యురాలు, రచయిత్రి సాహితీ వేత్త మద్దిరాల విజయ శ్రీముఖిని ఆదివారం ఘనంగా సన్మానం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో ఈనెల 11న సిరి కోన సాహితీ అకాడమి పంచవర్ష సాహిత్య ఉత్సవాల్లో భాగంగా శ్రీముఖిని ఉత్తమ రచయిత్రిగా గుర్తించి అవార్డును అందజేశారన్నారు. రచయిత్రీ శ్రీముఖి మాట్లాడుతూ తనకు వచ్చిన రూ.11,116 నగదు పురస్కారాన్ని కళా పరిషత్ ద్వారా పేద కళాకారులకు అందించాలన్నారు. కార్యక్రమంలో కళా పరిషత్ గౌరవ అధ్యక్షులు పీఎంఎస్ ప్రసాద్, డైరెక్టర్లు చాగంటిపాటి అజయ్, పొడుగు ప్రభాకర్, కోగంటి వెంకటేశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



కైకలూరు: పూర్వ విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకున్నారు. కై కలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 1969–70 పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 25 మంది కై కలూరు బృందావనం గేటెడ్ కమ్యూనిటీ హాలులో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థుల్లో కైకలూరు మండల మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు, న్యాయవాదులు గొర్తి ప్రభాకర దీక్షితులు, రుద్రపాక రత్నారావు, సికిందర్, శ్యామలరావులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి స్నేహితులు హాజరయ్యారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

పెనమలూరు: మహిళను వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్‌కు చెందిన ఎండీ ఆశ గత కొద్దికాలం క్రితం ఫైనాన్స్ కంపెనీలో అప్పు తీసుకుంది. అప్పు కొంత చెల్లించగా కొంత బాకీపడింది. అయితే ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్న ఉద్యోగి నీరజ్ తరచుగా ఆశకు ఫోన్ చేసి వేదించటమే కాకుండా అసభ్యంగా మెసేజ్‌లు పెడుతూ ప్రవర్తించ సాగాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.

అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం తాడిగడప కాలువ కట్టకు చెందిన జుజ్జవరపు కావ్య రెండేళ్ల క్రితం అదే ప్రాంతానికి చెందిన అనిల్‌ను కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. అనిల్ కారు డ్రైవర్‌గా పని చేస్తాడు. కాగా ఇచ్చిన కట్నం చాలలేదని అదనపు కట్నం తీసుకురమ్మని భర్తతో పాటు ఆడపడుచు మంజు, ఆమె భర్త నాగార్జున, మామ ప్రభాకరరావులు వే . ధిస్తుండంటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై పోలీసులు అత్తింటివారిపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేశారు.

గన్నవరం చేరుకున్న ఎమ్మార్పీఎస్ పాదయాత్ర

గన్నవరం: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు చేపట్టిన పాదయాత్ర ఆదివారం గన్నవరం చేరుకుంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద నాగరాజుకు ఎమ్మార్పీఎస్, మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయ సెంటర్‌లో జరిగిన సభలో నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తామని బీజేపీ నమ్మించి మోసం చేసిందన్నారు. దీనికి నిరసనగా ఉద్యమాలను తీవ్రతరం చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ఎమ్మార్పీఎస్, ఎంఈఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఐకు సత్కారం

కంకిపాడు: దళితఫోరమ్ ఆధ్వర్యంలో ప్రజాసంఘాల బాధ్యులు ఆదివారం కంకిపాడు ఎస్ఐ కె.సుధాకర్‌ను మర్యాదపూర్వకంగా కలి సి సన్మానించారు. ఫోరమ్ వ్యవస్థాపక అధ్య క్షుడు వర్రె వెంకటేశ్వరరావు, అగ్రిబోర్డు మాజీ చైర్మన్ నత్తా వెంకటేశ్వరరావు మాట్లా డుతూ యువతలో నైతిక విలువలు పెంపొందించాలని, గంజాయి, మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయా లని విజ్ఞప్తి చేశారు. ఫోరమ్ ప్రతినిధులు తాడితోటి నరసింహారావు, డాక్టర్ సతీష్, చుండూరు మోహనరావు, జె.రాజు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com